స్పెషల్ డిఇడి, బిఇడి కోర్సులలో ప్రవేశాలు

కడప అర్బన్ : హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడపలో డిఇడి, బిఇడి కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ బి.దౌలత్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సులు కేంద్ర ప్రభుత్వ రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే ఆమోదం పొందాయని తెలిపారు. కోర్సులలో చేరేందుకు ఇంటర్‌లో ఒసిలు 50శాతం, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్‌సి లు 45శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. బ్యాచిలర్ ఇన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ సైన్సు, మ్యాథ్మమెటిక్స్ స్పెషలైజేషన్ కలిగిన వారు 55శాతం మార్కులు తెచ్చుకోవాలన్నారు. కోర్సు చేసినవారు చెవిటి, మూగ బాలబాలికల ప్రత్యేక పాఠశాలలు, ఇన్‌క్లూజివ్ స్కూల్స్, భవితకేంద్రాలలో ఐఇఆర్‌టి ఉపాధ్యాయులుగా పనిచేయడానికి అర్హులని పేర్కొన్నారు. జులై 5లోపు అన్ని సర్టిఫికెట్లు, కోర్సు ఫీజు తీసుకుని కడప రామాంజనేయపురం వద్ద హెల్లన్ కెల్లర్ విద్యాసంస్థలకురావాలన్నారు. వివరాలకు 9849311680, 9966006758లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కమర్షియల్ షాక్

"ఈయన పేరు సత్యం, కడప నగరంలోని ప్రకాష్‌నగర్ వీధికి సమీపంలో చిన్నకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల కిందట కొట్టుకు కరెంటు బిల్లు రూ.400 వచ్చేది. ప్రభుత్వం ట్రూఅప్ పేరిట వడ్డించిన వడ్డింపుల నేపథ్యంలో మేలో రూ.900 బిల్లు వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో బిల్లు రావడం ఏమిటో తెలియడం లేదని వాపోవడం కనిపించింది." ఇలా అయితే బతికేదెట్లా అని ఆందోళనను వ్యక్తం చేయడం గమనార్హం.

- యూనిట్‌కు 83 పైసలు పెంపు
- జిల్లాపై రూ.6.77 కోట్ల భారం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని వ్యాపారులకు ట్రూఅప్ షాక్ తగిలింది. ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ట్రూ అప్ పేరిట మూడు రకాలుగా కరెంటు ఛార్జీలను భారీగా పెంచేసింది. ఈ మేరకు యూనిట్‌కు సగటున మూడు దశలుగా 83 పైసల చొప్పున పెంచి, 36 మాసాలపాటు వసూలు చేయనుంది. ఈలెక్కన జిల్లాపై రూ.6.77 కోట్ల మేర భారం పడింది. ప్రభుత్వం పేద, ధనిక తారతమ్యాన్ని పాటించకుండా మూడు కేటగిరీల చొప్పున ట్రూఅప్ ఛార్జీలను బాదేస్తోంది.

ఉమ్మడి కడప జిల్లాలో హెచ్‌విడిఎస్ 267 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఐదు కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని సబ్ స్టేషన్ల పరిధిలో 1,04208 లక్షల కమర్షియల్ సర్వీసులు ఉన్నాయి. చిన్నపాటి దుకాణాల దగ్గర నుంచి భారీ వాణిజ్య సముదాయాల వరకు ఉన్నాయి. ఈ ఏడాది మేలో 1,78,23,142 యూనిట్ల మేర విద్యుత్ వినియోగం జరిగింది. ప్రభుత్వం రూ.83 పైసల చొప్పున ఇటీవల పెంచిన ట్రూ అప్ ఛార్జీల నేపథ్యంలో జిల్లాలోని వ్యాపార కేంద్రాలపై రూ.6.77 కోట్ల మేర అదనపు భారం పడింది. ఫలితంగా జిల్లాలోని వ్యాపార వర్గాలు రెట్టింపు బిల్లులు చెల్లించడంపై పట్ల ఆందోళనను వ్యక్తం చేస్తుండడం గమనార్హం. 2014 నుంచి 2019 వరకు వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూ అప్‌ఛార్జీలను పెంచేసింది. 2022 ఆగష్టు నుంచి 2025 జులై వరకు యూనిట్‌కు రూ.83 పైసలు చొప్పున పెంచేసింది. 2025 జులై వరకు ప్రతి నెలా ట్రూఅప్ పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయనుంది. 2023 మార్చిలో 10.96, మేలో 13.57 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. మే నెలకు ట్రాన్స్‌కో రూ.90.12 కోట్ల ఆదాయం లభించాల్సి ఉంది.

2023 ఏప్రిల్‌లో 11 లక్షల, మే 13.57 లక్షల యూనిట్లు వినియోగం కావడం గమనార్హం. ఈ లెక్కన నెలకు రూ.90.12 కోట్ల మేర ఆదాయం సమకూరనుంది. కమర్షియల్ సర్వీసులకు పెద్దమొత్తంలో బిల్లులు వచ్చాయి.

జిల్లా వ్యాప్తంగా బిపిఎల్ కేటగిరీ కింద ఎనిమిది లక్షల కుటుంబాల వరకు ఉన్న సంగతి తెలిసిందే. పేదల ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి సామాన్యులను ఛార్జీల పెంపుదల నుంచి మినహాయించకపోవడం ఆందోళన కలిగిస్తోంది ప్రస్తుత ట్రూఅప్ ఛార్జీల పెంపు విషయంలో జిల్లాలోని 1,04208 వేల కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు మీద ట్రూ అప్ ఛార్జీలను రెట్టింపు చేయడం పట్ల వచ్చే ఆదాయం కరెంటు ఛార్జీలకు సరిపోతోందనే వాదన వినిపిస్తోంది. రెండు నెలల కిందట కడప నగరంలోని ఓ చిరు వ్యాపారికి రూ.400 వచ్చే కరెంటు బిల్లు ప్రస్తుతం రూ.900 రావడం ఆందోళన కలిగించిందని పేర్కొనడం గమనార్హం. పెట్టుబడికి వడ్డీల చెల్లింపులు పోగా జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వాపోవడం గమనార్హం.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ప్రతినెలా రూ.514 కోట్లు చెల్లింపులు
- మూడు సబ్‌ట్రెజరీ భవనాలకు టెండర్లు
- ఇకెవైసిని తప్పనిసరిగా చేయించుకోవాలి
- ట్రెజరీ డిడి ఎం.ఎస్ వెంకటేశ్వర్లు వెల్లడి

ముఖా ముఖి..

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు పరి ష్కరించుకోవాలి. ఉద్యోగులకు అందుబాటులో ట్రెజరీశాఖ ఉద్యోగు లు అందుబాటులో ఉంటారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకా రం ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాల్సి ఉంది. సిఎఫ్ఎంఎస్ వ్యవస్థ అమలు నేపథ్యంలో ట్రెజరీస్ ఉన్నతాధికారుల పై అదనపు భారం పడింది. దీనికితోడు ఆర్టీసీ ప్రభుత్వ పరిధిలోకి రావడంతోపాటు త్వరలో వైద్యఆరోగ్యశాఖ కూడా ప్రభుత్వ పరిధిలో రానున్న నేపథ్యంలో మరింత భారంగా మారే అవకాశం కనిపి స్తోందని పేర్కొంటున్న ట్రెజరీస్ డిడి ఎం.ఎస్ వెంకటేశ్వర్లుతో ప్రజా శక్తి ముఖాముఖి...

సబ్‌ట్రెజరీ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లాలో తొమ్మిది సబ్‌ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ముద్దనూరు, కమలాపురం, పులివెందుల, బద్వేల్, సిద్ధవటం ప్రాంతాల్లో ఉన్నాయి.

ట్రెజరీ కార్యాలయాల పనులేమిటి?

జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాలు ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల చెల్లింపులు, వాటి రికార్డులను నిర్వహించడం, కొత్తగా చేరి న ఉద్యోగులకు ఐడి, ఇతర రికార్డులను నిర్వహించడం, పీడీ అకౌ ంట్ల నిర్వహణ, స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ, ఆప్కోస్, కాంట్రాక్టు, క్లాస్ - 4 ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయడం జరుగు తుంది.

ఇకెవైసి నమోదు ఎలా ఉంది?

జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా ఇకెవైసిపి చేయించుకోవాలి. ఇకెవైసి నమోదులో జిల్లా మధ్యస్థంగా ఉంది. ఇప్పటివరకు ఉద్యోగులు 99 శాతం, పెన్షనర్స్ 84 శాతం నమోదు చేశాం.

ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు తెలపండి?

జిల్లాలో 28 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 18 వేల మంది పెన్షనర్స్ ఉన్నారు. ప్రతి నెలా సదరు ఉద్యోగుల జీతభత్యాల, పెన్షన్స్, వంటి ఇతర చెల్లింపులు ప్రక్రియ నడుస్తోంది. వీటితోపాటు రిటైర్డు ఉద్యోగుల బకాయిలు, గ్రాట్యూటీ చెల్లింపులను చేయడం గమనార్హం.

ట్రెజరీ చెల్లింపుల గురించి తెలపండి?

ప్రతి నెలా ట్రెజరీశాఖ ద్వారా రూ.514 కోట్లు మేర ఉద్యో గుల జీతభత్యాలు, పెన్షనర్లకు సంబంధించి పెన్షన్ల రూపంలో చెల్లిం పులు చేయడం జరుగుతోంది.

పీడీ అకౌంట్ల ద్వారా చెల్లింపుల డిపార్టుమెంట్లు ఎన్ని?

జిల్లాలో 10 శాఖల వరకు ఉన్నారు. ఇందులో వైద్య ఆరో గ్యశాఖ, డ్వామా, స్పోర్ట్ స్కూల్, యూనివర్శిటీ, ఆర్కిటెక్చర్ యూని వర్శిటీ సహా ఇతర శాఖల పరిధిలోని ఉద్యోగులు ఉన్నారు. వీటి పరిధిలోని ఉద్యోగులకు పిడీ అకౌంట్ల ద్వారా జీతభత్యాలు చెల్లిం పులు చేయడం జరుగుతుంది.

ఆప్కోస్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది?

జిల్లాలో ఆప్కోస్ కింద 3,600 మంది, ఔట్‌సోర్సింగ్ కింద 1100, కాంట్రాక్టు ఉద్యోగులు 2,000 మంది వరకు ఉన్నారు.

సబ్‌ట్రెజరీ భవన నిర్మాణ పనుల గురించి చెప్పండి?

జిల్లాలో సిద్ధవటం, జమ్మలమడుగు, ముద్దనూరు సబ్‌ట్రెజరీ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రతి సబ్‌ట్రెజరీ భవనానికి రూ.కోటి వ్యయంతో టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

జులై 10,11వ తేదీల్లో అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం జులై 10,11న నిర్వహించే 36 గంటల నిరసన జయప్రదం చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మిదేవి, బి.లక్ష్మిదేవి పిలుపు నిచ్చారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించటానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. రిటైర్డ్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఆయాల ఉద్యోగోన్నతలకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని తెలిపారు. రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని చెప్పారు. కార్యకర్తలకు సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని కోరారు. టంగుటూరు మండలంలో హత్యకు గురైన అనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని సెంటర్లకు గ్యాస్ సరఫరా చేయాలని పేర్కొన్నారు. నిరసనలో అంగన్‌వాడీలు, మినీ వర్కర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్య రంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి హాజరై మాట్లాడారు. జీవో 117 అమలుతో ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగం నిర్వీర్యం, మూడు నాలుగు తరగతిలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ఉపాధ్యాయుల బోధనకు, విద్యార్థుల సామర్థ్యాలకు మధ్య అంతరం ఏర్పడి సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు కొనసాగిస్తూనే ఆరో తరగతి నుంచి పదవ తరగతి ప్లస్ టు ఒకచోట నిర్వహిస్తే విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతారని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందని సబ్జెక్టు ఉపాధ్యాయులు తగినంత మంది లేకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే డిఎస్‌సిని ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని తెలిపారు. కచ్చితంగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు పోరాడుతూ ఉంటామని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కట్ ఆఫ్ తేదీని 2014 ముందు ఐదు సంవత్సరాలు నియామకం పొంది ఉండాలనే నిబంధనను తొలగించి అందరిని రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వం 11వ పిఆర్‌సికి సంబంధించి బకాయిలు, డిఎ బకాయిలు చెల్లించకుండా వాయిదాల పద్ధతిలో 2027వ సంవత్సరం వరకు చెల్లిస్తామని చెబుతూ ప్రస్తుతం 12వ పిర్‌సిని ప్రకటిస్తున్నట్లు తెలియజేయడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జూలై 9న ఉమ్మడి జిల్లాలో సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 98 డీఎస్సీలో మిగిలిపోయిన ఉపాధ్యాయులను వెంటనే నియామకం జరిపి ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, డి సుజాత రాణి, జిల్లా కార్యదర్శి, మస్తానయ్య, ఏజాస్ అహ్మద్, చెన్నయ్య, సివి రమణ, పర్వీన్, ఆడి కమిటీ కన్వీనర్ నరసింహారావు సుదర్శన్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సిసిపై కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - వల్లూరు

మహిళ సంఘాలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడిన సిసి సునీత పై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ ఆనంద్‌నాయక్ అన్నారు. మహిళ సంఘాలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు రావడం, పైగా కొందరు విఒఎలు డిఆర్‌డిఎ పీడీతోపాటు, కలెక్టర్‌ను అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకునేందుకు ఆదివారం పీడీ ఆనంద్ నాయక్ వల్లూరు మండల సమాఖ్య సభ్యులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ఎపిఎం శైలజాను, అకౌంటెంట్ నాగరాజును విచారించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన సిసిని సస్పెండ్ చేస్తామని అన్నారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు కోసం పోలీసు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలువురు విఒఎలతో ఆయన సమావేశం నిర్వహించారు. సమాఖ్యలో జరిగిన అక్రమాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఏపీడీ ప్రసాద్ తదితర పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న పీడీ ఆనంద్‌నాయక్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కడప : రానున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లోగా కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసే దిశగా కడప జిల్లాలోని మండలాలు, కడప డివిజన్లలో మైనార్టీ విభాగపు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ ఖాన్, కడప నగర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్ తెలిపారు. కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆదేశాల మేరకు ముస్లిం మైనార్టీలను అలాగే ఇతర బలహీన వర్గాలను కూడా కాంగ్రెస్ పార్టీ లో చేర్చుకుని తద్వారా పార్టీ మైనార్టీ కమిటీలు నియమించనున్నట్లు తెలిపారు. అందువల్ల ముస్లిం మైనార్టీలతో పాటుగా ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. దేశంలో గాడ్సే వాదులకు, గాంధీయవాదులకు సంగ్రామం జరుగుతుందన్నారు . బిజెపి ప్రభుత్వంలో ముస్లిములను, దళితులను, ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను ఆపివేసే దిశగా అక్రమ కేసులు పెట్టడం, జైల్లో నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

అద్వితీయ కళాకారుడు 'అమళ్లదిన్నె'

ప్రజాశక్తి - కడప అర్బన్

జానపద ప్రదర్శనల్లో గొర్రెల కాపరి, సోది వంటి హాస్య పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించిన అద్వితీయ కళాకారుడు అమళ్లదిన్నె గోపీనాథ్ అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళలశాఖ రిటైర్డ్ ఆచార్యులు చిగిచర్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 121వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'అమళ్లదిన్నె గోపీనాథ్ జీవితం 'సాహిత్యం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 'పొద్దన్నే లేసినాడు కాదరయ్య, వాడు కాళ్లుమొగం కడిగినాడు కాదరయ్యా....' పాట వినగానే గుర్తుకొచ్చేవ్యక్తి గోపీనాథ్ అన్నారు. అవధానాలలో అప్రస్తుత ప్రసంగానికి అమళ్లదిన్నె గోపీనాథ్ పెట్టింది పేరని కొనియాడారు. కార్యక్రమ ప్రారంభంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి, ఆచార్య పి.రమాదేవి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, రఘునాథరెడ్డి, కె.రాజారెడ్డి, డా.వెల్లాల వెంకటేశ్వరాచారి, పురుషోత్తం రెడ్డి, డాక్టర్ రాజగోపాల్ రెడ్డి కలసి వక్త ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు.

నవజీవన్ ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎర్రముక్కపల్లి దగ్గర ఉన్న నవజీవన్ సేవ ఆశ్రమంలో ప్రభుత్వ అధ్యాపకులు వసంత్‌రావు తనయుడు రోవన్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు వసంత్ రావు మాట్లాడుతూ అన్నదానం చేయడం వల్ల మనసుకు ప్రశాంతత, సంతోషంగా కల్గిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆశ్రమాలకు ఏదో ఒక రూపంలో సేవలు అందించి వారికి చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వద్ధాశ్రమం నిర్వాహకులు ఎస్. రాజశేఖర్, ఓబులేసు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఉన్న క్రికెట్ నెట్స్‌లో నిర్వహించిన అండర్ -14, అండర్ -16 విభాగాలకు చెందిన జిల్లా స్థాయి క్రికెట్ చెట్ల ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఈ రెండు విభాగాలకు సంబంధించి 230 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. అండర్-14 కు 130 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన 65 మందిని ఎంపిక చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ తెలిపారు. అండర్-16కు 100 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 45 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికలకు హాజరైన వారికి బౌలింగ్, బ్యాటింగ్, కీపింగ్‌లలో సెలక్షన్ కమిటీ సభ్యులు ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మునగ సాయి పృథ్వి తేజ, పురుషుల క్రీడాకారుల రిప్రజెంటేటివ్ షేక్ మహమ్మద్ దౌలా, అసోసియేషన్ సభ్యులు ముని కుమార్ రెడ్డి, శివప్రసాద్, సుబ్రహ్మణ్యం, విష్ణు మోహన్ రావు, ఆనంద్ పర్యవేక్షించారు.

ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

ఎపిలో అభివృద్ధి శూన్యం

కడప అర్బన్ : ఎపిలో వైసిపి ప్రభుత్వం దోచుకోవడం..దాచుకోవడం తప్ప అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ విమర్శించారు. ఆదివారం కడపలో బిజెపి కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియా సమావేశంలో మాట్లా_డారు. ఎంతమేరకు కమీషన్లు తీసుకున్నా సిఎం జగన్‌కు తని వితీరడం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై కమీషన్లు తీసుకుంటూ ఖాజానా నింపుకుంటున్నారని విమ ర్శించారు. అది చాలక ఇప్పుడు ప్రజల ఆస్తులపై కన్నేశారని తెలిపారు. చుక్కల భూముల పేరుతో తీసుకువచ్చిన జిఒ పేదలపై ప్రేమతో కాదని, చుక్కల భూములను తన ఆస్థాన కంపెనీలకు కట్టబెట్టేందుకు తెచ్చారని విమర్శించారు. ప్రజలు వారసత్వంగా, కష్టపడి సంపాదించుకున్న భూముల పట్టాదారు పాసుబుక్కులపై జగన్ బొమ్మ దేనికని ప్రశ్నించారు. దీని వెనుక పెద్దకుట్రే దాగి ఉందని హెచ్చరించారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల ఎకరాలు తన ఆస్థాన కంపెనీలైన ఇండోసోల్, అరబిందో, షిర్డిసాయి కంపెనీలకు కట్టబెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆస్తులను సొంత కంపెనీలకు అప్పజెప్పేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలను, ప్రభుత్వ ఆస్తులను కాపాడే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.

జీవోను ఉపసహరించుకోవాలి

పోరుమామిళ్ల : బ్రహ్మాసాగర్ నుంచి కడపకు నీటిని తరలించేందుకు ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన జీవోను తక్షణమే ఉపసహ రించుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు నగిరి బైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం టేకురుపేటలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ధర్మల్‌కు నీటిని తరలిస్తున్నారని, మళ్లీ కడపకు తరలిస్తే బద్వేలు మైదుకూరు నియోజకవర్గ ప్రాంతాలు ఎడారిగా మారుతాయి అన్నారు. కుందూ నుంచి ప్రతి సంవత్సరం 50 నుంచి 100 టిఎంసిల నీరు వస్తున్న కరువు ప్రాంతాల కోసం నిర్మించిన బ్రహ్మాసాగర్ ప్రాజెక్టు నుంచి కడపకు నీటిని తరలించడం వల్ల పోరుమామిళ్ల మండలానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరుమామిళ్ల పెద్ద చెరువు ద్వారా సరఫరా అయ్యే నీరు నిలిచిపోవడంతో రైతులకు అన్యాయం కల్గుతుందని తెలిపారు. పోరుమామిళ్లలో త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తా మన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని చిత్తు చిత్తుగా ఓడిస్తారని వారన్నారు. కార్యక్ర మంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సీత బాలాజీ, పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌వలి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆకుల మునెయ్య, నాయకులు పెద్ద దుగ్గయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కడప జిల్లాకు చెందిన ఎస్. గోవర్ధన్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా తిప్పగాండ్ల జనార్ధన్ ఎన్నిక య్యారు. ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా సూర్యలంక లోటస్ పాండ్‌లో ఆదివారం నిర్వహించిన ఆంధ్ర కబడి అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్, ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో తమకు ఈ పదవులు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమను ఎన్నుకున్న రాష్ట్ర అసోసియేషన్ కమిటీ సభ్యులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో రాష్ట్రంలో కబడ్డీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్ : ప్రభుత్వ రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేసి అనేక అక్రమాలకు పాల్పడుతున్న వేంపల్లి మండలం టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన హౌస్‌ట్యాక్స్ రికార్డును మార్చి ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. 2020వ సంవత్సరంలో హౌస్ మ్యాపింగ్ చేశారని, దానితో రికార్డులను పోల్చిచూడాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్పందన హర్షణీయం

- జెఎసి రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

మీడియాతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందన హర్షణీయమని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్ప రాజు వెంకటే శ్వర్లు అన్నారు. ఆదివారం ఎపి జెఎసి అమరావతి జోన్-4 సమావేశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సిపిఎస్ రద్దు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడూ సిఎం దృష్టికి తీసుకుని వెళ్లామని చెప్పారు. సానుకూలంగా స్పందించి పరిష్కరించిన సిఎంతో పాటు సిఎస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంట్రాక్ట ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. తక్కువ జీతం వచ్చే వారికి రేషన్ కార్డు, ప్రభుత్వ పథకాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. సిఎఫ్ఎంఎస్‌లో పేరు ఉన్న కారణంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రేషన్ కార్డులు, పథకాలు ఆగిపోయామని తెలిపారు. సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లలో కొన్ని పరిష్కరించడం వల్ల ఉద్యమాలను తాత్కాలికంగా ఆపేశామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర రావు, జిల్లా చైర్మన్ కె.కె. కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల కమిటీ నియామకం

ప్రజాశక్తి - కడప

నియామక పత్రం అందజేస్తున్న తులసిరెడ్డి

కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం పులివెందుల అసెంబ్లీ కమిటీనీ జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య నియమించారు. అధ్యక్షుడిగా నికిల్, ఉపాధ్యక్షుడుగా రామకృష్ణరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా యన్.పుల్లయ్య, వెంగల్ రెడ్డి, కార్యదర్శులుగా నాని, స్టాలిన్ బాబు,తరుణ్ కుమార్ రెడ్డి, శరత్ చంద్ర, చిన్నా, జగన్, అఖిల్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వేలూరు శ్రీనివాసుల రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ఇన్‌ఛార్జి మమత మాధవ్,రాయలసీమ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి గౌతం గారిలి ఆదేశాల మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం నిఖిల్ మాట్లాడుతూ కార్మిక విభాగం అసెంబ్లీ అధ్యక్షునిగా నియమించిన జిల్లా అధ్యక్షు నికి, రాష్ట్ర ఇన్‌ఛార్జికి కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక విభాగం ప్రొద్దుటూరు అధ్యక్షుడు ఎల్లయ్య, కడప నగర అధ్యక్షుడు ఉదయ్, టాక్సీ డ్రైవర్ జిల్లా నగర అధ్యక్షులు విక్కీ , హబీబుల్లా, ప్రొద్దుటూరు అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఖలందర్లు పాల్గొన్నారు.

జమాల్‌బాష మృతి తీరని లోటు

పోరుమామిళ్ల టౌన్ : ప్రముఖ కళాకారుడు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్త, సామాజిక స్పృహ కలిగిన జమాల్ బాష మృతి తీరని లోటు అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు గఫార్, ఖాసీంవల్లి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆఫ్రిది అధ్యక్షతన జమాల్‌బాష సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమాల్‌బాష మంచి రంగస్థల నటుడని తన చక్కని కంఠస్వరంతో ప్రేక్షకులను అలరించే వారని కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక సభ్యునిగా పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాలలో విద్యార్థులలో సైన్సు విలువలు పెంపొందించేందుకు కృషి చేశారన్నారు. ప్రతి ఏడాదీ గ్రంథాలయంలో నిర్వహించే సమ్మర్ క్యాంపులో పాటలు, గేయాల ద్వారా విద్యార్థులు సైన్సు పట్ల మక్కువ పెంచుకునేలా ప్రోత్సహించే వారని ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పవన్ కుమార్, బాదుల్లా, సిద్ధయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ స్టాల్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ఎలక్ట్రికల్ వస్తువుల ప్రదర్శన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని పెన్నా నది ఒడ్డున త్యాగరాజారెడ్డి కల్యాణమండపంలో ప్రొద్దుటూరు ప్రయివేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఎలక్ట్రికల్ స్టాల్స్‌ను ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఏర్పాటు చేసిన అన్ని రకాల ఎలక్ట్రికల్ వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, టిటిడి పాలకమండలి సభ్యుడు మారుతీ ప్రసాద్, రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, నాయకులు

ఇడుపులపాయ పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి - చాపాడు

ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి ఇడుపులపాయకు పాదయాత్ర చేస్తున్న వైఎస్‌ఆర్ అభిమాని కుప్పల నరసింహ ఆదివారం వనిపెంటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మైదుకూరు వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆదం రఫీ, కలాం, మస్తాన్‌వలి, ఎంపిటిసి ఇర్షాద్ హుస్సేన్, సుధాకర్‌రెడ్డి, నందారెడ్డి, పప్పనపల్లె సర్పంచు రాజగోపాల్‌రెడ్డి, ఫారూఖ్, మహబూబ్ బాషా, ఇబ్రహీం, ఆరిఫ్ పాల్గొన్నారు.

మహమ్మద్ గౌస్‌ను అభినందిస్తున్న రహంతుల్లా

ఆమ్‌ఆద్మీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలో ఆమ్‌ఆద్మీ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపల్లె మండల కమిటీలో కొన్ని మార్పులు చేసినట్లు చెప్పారు. ప్రజాసేవే లక్ష్యంగా ఆమ్‌ఆద్మీ పార్టీ పనిచేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతునే ఉంటుందని తెలిపారు. మండల కమిటీలో కన్వీనర్‌గా మహమ్మద్ గౌస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సలహాదారులుగా పీరుబాషా, ట్రెజరర్‌గా సమీర్, యూత్ వింగ్ అండ్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా సిరాజుద్దీన్, 13వ వార్డు బూత్ కమిటీ ఇన్‌ఛార్జిగా బాబ్జీని నియమించినట్లు చెప్పారు. ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరేందుకు యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజల కనీస అవసరాలు తీర్చి, వారికి సౌకర్యవంతమైన జీవితాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని సున్నపుబట్టీ (ప్రగతినగర్) కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తుండడంతో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, మున్సిపల్ అధికారులతో ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు రూ.35లక్షలతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గత పాలకులు ప్రొద్దుటూరును ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంతో ప్రొద్దుటూరులో సమస్యలే ఉన్నాయన్నారు. తాము అధికారంలోకొచ్చాక కూరగాయల మార్కెట్, బస్టాండు, మంచినీటి పథకం ఇలా ఒక్కొక్కటి చేసుకుంటూ వస్తున్నామన్నారు. పట్టణంలోని 40వార్డులు కూడా ఇలాగే అభివృద్ధి చేశామన్నారు. ఈ క్రమంలో ఇక్కడ కూడా రహదారి, కాలువలను పూర్తి చేస్తామన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కడప

తొగటవీర క్షత్రియ విద్యార్థులు విద్య, వైద్య రంగంలో రాణించి ఉన్న స్థాయికి ఎదిగాలని తొగటవీ క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్ అన్నారు. సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథులు నగదు పురస్కారాలు, మెమోంటోలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. 78 మంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ. 2 వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ నాలుగు సంవత్స రాలుగా సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి బాగా చదివి తల్లిదండ్రులకు, కులానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ విద్యార్థులు ముందుగానే లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కడప నగర శాఖ ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, కోశాధికారి టేకూరు సుదర్శన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఆర్‌ఐ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సిఆర్‌ఐ సునీల్ జయంత్, యువజన నాయకుడు మోతుకూరు సుబ్బరాయుడు ,బొమ్మిశెట్టిశెట్టి చంద్రశేఖర్, ఉమ్మడిశెట్టి జనార్ధన్, ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, బండి కృష్ణయ్య, టేకూరు పుష్పాంగద, పల్లావాగేష్, పల్లా మురళి, వేల్పుల ఉత్తన్న, దొండ్ల వెంకటరమణ, చింతా సుబ్బరామయ్య, పల్లా బాల చౌడన్న, దండే నాగభూషణం, సంగినాథం కొండయ్య, కాటా రామదాసులతోపాటు పెద్ద సంఖ్యలో కుల బంధువులు పాల్గొన్నారు.

మొదటి బహుమతి అందుకుంటున్న విద్యార్థి

ఆటో ఆగితే.. కుటుంబం పస్తే..!

వారు స్టీరింగ్ పడితేనే వారి కుటుంబం కదులుతుంది.. వారు ఆటో స్టార్ట్ చేస్తేనే పిల్లల చదువులు సాగుతాయి.. నిరంతరం రోడ్డుపైన తిరిగితేనే అమ్మా నాన్నలకు వైద్యం అందుతోంది.. ఆటో రయ్‌మని రోడ్డుపై పరి గెడితేనే ప్రయాణికులు గమ్యాన్ని చేరుకోగలరు. అయితే వీరి ఆటో ఒక రోజు ఆగితే వారి కుటుంబం పస్తులుండాల్సిందే. ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడాల్సిందే. కుటుంబాలను వదిలి ఎండనక, వాననక, దుమ్ము, కాలుష్యం లెక్కచేయకుండా రోజంతా కష్టపడేది ఆటో కార్మికులే.

ప్రజాశక్తి - జమ్మలమడుగు

బస్సు సర్వీసు లేని కొన్ని గ్రామాలకు ఆటోలే ప్రధాన ప్రయాణ సాధనం. పట్టణంలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లాలంటే ముందుగా గుర్తొచ్చేది ఆటో. ప్రయాణానికి కీలకంగా మారిన ఆటోలు నడిపే వారి జీవనం మాత్రం అంతంత మాత్రమే. రోజంతా కష్టపడినా ఖర్చులు పోనూ రూ.200 నుంచి రూ.300 ఆదాయం వస్తుంది. ఏ రోజు ఆటో ఆగినా ఆరోజు జీవనం భారమే. వారికి కష్టం ఎక్కువ.. ఆదాయం తక్కువగా మారింది. ఆటోల సంఖ్య గణనీయంగా పెరిగింది. పోటీతత్వం ఎక్కువగా ఉంది. ప్రతి పట్టణంలో 10నుంచి 20వరకు ఆటోస్టాండ్లు ఉంటున్నాయి. ఇక్కడ దాదాపు వెయ్యి మంది కార్మికులుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో నడుపుతారు. వీరు ప్రయాణికులతోపాటు విద్యార్థులు, రోగులు, వృద్ధులకు సేవలందిస్తుంటారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి

ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతకు ఆటో డ్రైవింగ్ ఒక ఉపాధిగా మారింది. ఆటో నడపడమే వృత్తిగా భావిస్తున్నారు. తద్వారా వచ్చే సొమ్ముతో తనపై ఆధారపడిన వారిని పోషిస్తూ, వారి అవసరాలు తీరుస్తున్నారు. జమ్మలమడుగు పట్టణంలో దాదాపు 100మందికి పైగా ఆటో నడుపుతున్నారు.

ఆటోస్టాండ్‌లేక అవస్థలు

ఆటో నడిపే డ్రైవర్లకు పలు శాఖల అధికారుల వేధింపులు వారిని అవస్థలుపెడుతున్నాయి. రవాణా, పోలీస్, ట్రాఫిక్ అధికారులు చలానాలతో వారిని ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధినిచ్చే ఆటోలను నిలుపుకోవడానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీలు, ఆటో డ్రైవింగ్ అర్హతను బట్టి ఇవ్వాలని కోరుతున్నారు. ఆటోడ్రైవర్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, ఆటో వర్కర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి కులమతాలకు అతీతంగా సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆటో కార్మికులకు ఉచిత వైద్యం అందించాలని కోరుతున్నారు. యూనిఫాంను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలనేది వారి డిమాండ్. బ్యాడ్జి కలిగి 50 ఏళ్లు దాటినా డ్రైవర్లకు నెల పెన్షన్, ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతున్నారు.

చలానాలతో ఇబ్బందులు : విజయ్, సిఐటియు

పట్టణంలో చాలామంది కార్మికులకు ఆటోనే జీవనం. రోజంతా కష్ట పడినా వారి ఆదాయం చాలా తక్కువ. పోలీస్, రవాణా అధి కారుల చాలానాలతో వారికి ఇబ్బందిగా ఉంది. సుమారు ప్రతి ఆటో కార్మికుడు నెలకు చలానా రూపేనా దాదాపు రూ.1000 కడుతున్నాడు. రోడ్ టాక్స్‌లు కూడా అధికంగానే ఉంటున్నాయి.

ఆదాయం లేదు : ఆదాము, ఆటో కార్మికుడు

ప్రస్తుతం నిత్యవసర కుటుంబ ఖర్చులు బాగా పెరిగాయి. ఖర్చులు తగ్గట్టు ఆదాయం పెరగడం లేదు. ఆటో కార్మికుల సంఖ్య బాగా పెరుగుతోంది. ఆటోస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపాలిటీ అధి కా రులు ఏర్పాటుచేస్తే మేలు.

జీవనం కష్టంగా ఉంది : ఏసుదాసు, ఆటో కార్మికుడు

ఎన్నో ఏళ్లుగా ఆటో కార్మికుడిగా పనిచేస్తున్నాను. ఆటో నడపని రోజు ఇబ్బందులు తప్పవు. రోజురోజుకూ పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో మరింత భారంగా జీవనం సాగుతోంది. ప్రభుత్వం ఆటోవాలాలకు సబ్సిడీ రుణాలిచ్చి ఆదుకోవాలి.

కొండెక్కిన మాంసం ధరలు

- మటన్ కిలో రూ.800, చికెన్ కిలో రూ.280, స్కిన్‌లెస్ రూ.300

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇటీవల కాలంలో మాంసం ధరలు కొండెక్కుతున్నాయి. మాంసం కొనాలంటే వినియోగదారులు హడలిపోతున్నారు. ఆదివారం వచ్చిందంటే మాంసపు ప్రియులు ఆ దుకాణాల వద్ద ఉదయం నుంచే బారులుదీరుతారు. అయితే ప్రస్తుతం మటన్, చికెన్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొనాలంటే సామాన్యులకు దడ పుడుతోంది. ఆ దుకాణాల వైపు చూడాలంటే హడలిపోతున్నారు. ప్రస్తుతం కిలో చికెన్ రూ.280. అదే స్కిన్‌లెస్ చికెన్ అయితే రూ.300పెట్టాల్సిందే. ఇక మటన్ విషయానికొస్తే కిలో రూ.800. ఈ ప్రకారం మాంసం ఇంటికి తీసుకెళ్లాలంటే పేద, మధ్య తరగతివారికి గుండెలు గుభేలుమంటున్నాయి. వీటి ధరలను చూసి సామాన్యులు ఆ వైపు అడుగులు వేయడంలేదు. దీంతో మటన్, చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. గత నెలలో రూ.220గా ఉన్న చికెన్ ధర ఇప్పుడు ఏకంగా రూ.80 పెరిగింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న జనానికి చికెన్ ధరలు మరింత ప్రియమయ్యాయి. మటన్, చికెన్ ధరల పెరుగుదలకు వ్యాపారులు పలు కారణాలు చెబుతున్నారు. వేసవి కాలంలో చికెన్ వేడి చేస్తుందని మటన్ వైపు మొగ్గు చూపుతారని, ఎండలకు కోళ్లు చనిపోయి, వాటి దిగుమతి ఉండదని. ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో, దాణా ధరలు పెరగడం, ఇతర ఖర్చుల కారణంగా చికెన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. జూన్ రెండవ వారంలోకి ప్రవేశించినా వర్షం జాడ లేకపోవడం, ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతూ ఉండడంతో వర్షాకాలం ఊపందుకునే వరకు చికెన్ ధరలు భారీగానే ఉంటాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వెలవెలబోతున్న చికెన్ దుకాణం

విద్యనేర్పిన గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్ననాటి జ్ఞాపకాలు పదిలం

ప్రజాశక్తి - వేంపల్లె

చిన్న నాటి జ్ఞాపకాలు పదిలంగా నిలిచి పోతాయని ఎంఇఒ వీరారెడ్డి, రిటైర్డ్ ఎంఇఒ సోమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తల్లిశెట్టి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని వేమయ్య, శివ శంకర్, మెహైల్, శ్రీను, సుబ్బారావు, చెన్నకేశవ, గురు, దర్బార్, సుబ్బారెడ్డి, కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉర్దూ ఘర్ షాదీఖానాలో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా బాలుర పాఠశాల ఆవరణలో ఒకేచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు తమ పట్ల చూపిన అభిమానానికి వారు నమస్కార వదనంతో ఘనంగా సత్కరించి గౌరవించారు. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఈ ఆత్మీయ సమ్మేళనం చేసుకోవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఒకరికొకరి ఆత్మీయ ఆలింగనంతో ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం స్నేహితులు అందరూ కలిసి భోజనాలు ఆరగించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వం గొప్పగా ఉండాలి

ప్రతి ఒక్కరిలో వ్యక్తిత్వం అనేది గొప్పగా ఉండాలని రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులు తెలిపారు. 1991-1993 బ్యాచ్‌కు చెందిన శ్రీవాసవి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక ఎస్‌ఎన్‌ఆర్ కల్యాణమండపంలో నిర్వహించారు. విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులు మాట్లాడుతూ స్వార్థం సంపదను, పేరును హరించివేస్తుందన్నారు. స్నేహం మరపురానిదని తెలిపారు.. ఎక్కడో ఉన్నవారంతా ఒక చోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి కృషి చేసిన సంజీవ గౌడ్, బాలం హరి, ధర్మారెడ్డి, భాస్కర్‌రెడ్డిలకు స్నేహితులందరూ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. విందు అనంతరం స్నేహితులు అందరూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహులును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాతమిత్రుల కలయిక సంతోషకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

1986-87లో స్థానిక వసంతపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా పలకరించుకుని సంతోషకం వ్యక్తం చేశారు. 36ఏళ్ల అనంతరం వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ తమ అనుభవాలు చెప్పుకున్నారు. మానవతా విలువలతో ఉన్నతంగా జీవిస్తున్న తమ విద్యార్థులను చూసి అప్పటి ఉపాధ్యాయులు సంతోషించారు. మరింతగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. తమ విద్యార్థుల కోరిక మేరకు తెలుగు పండితులు పద్యం పాడి అలరించారు. తమ మధ్యలేని మిత్రులకు సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు వీలైనంత సహకారం అందించాలని భావించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు అదే పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న నిస్సాం్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించారు. అందుబాటులో ఉన్న అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆ బ్యాచ్‌లో పదవ తరతగి చదివి, అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న విద్యావతితోపాటు విశ్రాంత ఉపాధ్యాయులు ఎసి దస్తగిరి, ఈశ్వరరెడ్డి, హెలెన్, పుల్లారెడ్డి, నాగభూషణం, కాంతాబాయి, శివరామిరెడ్డి, నారపరెడ్డి పాల్గొన్నారు.

36ఏళ్లకు కలుసుకున్న అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూసార పరిరక్షణపై రైతుల దృష్టి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పంట దిగుబడి అనంతరం పొలంలోని వ్యర్థాలను గతంలో ఓ చోట కుప్పచేసి నిప్పుపెట్టి కాల్చేసేవారు. లేదంటే ఇతరులకు అమ్మేవారు. ప్రస్తుతం మూల ఆరోగ్య పరిరక్షణపై రైతులు దృష్టి పెట్టారు. గతంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధి కారులు చెప్పినా పట్టిం చుకోకుండా పంట వ్యర్థా లను చేలల్లో లేకుండా చేసేవారు. ప్రస్తుతం ఆధునిక యంత్రాల వల్ల శనగ సాగు చేసిన రైతులంతా పంటలోని వ్యర్థాలను చేలోనే ఉంచాల్సి వచ్చింది. గతంలో శనగ పంట నూర్పిడి చేసిన తర్వాత పొట్టు నామమాత్రపు రేటుకు అమ్ముకునే వారు. ప్రస్తుతం వచ్చిన ఆధునిక యంత్రాల ద్వారా నూర్పిడి చేయడం వల్ల పొట్టు వచ్చే అవకాశం లేదు. ఖర్చు తగ్గుతుంది. పంట వ్యర్థాలు చేలోనే ఉండడం వల్ల దున్నితే భూమిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకునే విధానాన్ని అవలంభిస్తున్నారు. మిరప, పత్తి పైర్లను సైతం రొటేవేటర్ ద్వారా పొలంలోనే దమ్ము చేస్తున్నారు. దమ్ము చేసిన కొంత వ్యవధిలోనే కొంగలు అక్కడకు చేరుతున్నాయి. భూమిలో నుంచి వచ్చిన క్రిమి కీటకాలను అవి తింటున్నాయి. దీనివల్ల భవిష్యత్‌లో పురుగుల సమస్య తగ్గడమే కాకుండా పంటలో వ్యర్థాలు నేల ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం వస్తుంది. గతంలో పంటలో వచ్చే చెత్తా చెదారాన్ని తగులబెట్టే వారు. దీనివల్ల పొగకాలుష్య సమస్య ఏర్పడేది. రైతులు పంట వ్యర్థాలను ఉపయోగించే విధానంలో అనుసరిస్తున్న మార్పులతో వాతావరణ కాలుష్య సమస్యను నేల ఆరోగ్యాన్ని పెంపొందించు కునేందుకు ఇది ఎరువుగా ఉపయోగ పడుతుంది. మిరప, పత్తి, పొద్దుతిరుగుడు తదితర పంటల వ్యర్థాలను పూర్వం వంట చెరుకుగా ఉపయోగించేవారు. ప్రస్తుతం వీటిని పంట చేతికి వచ్చిన అనంతరం సేంద్రియ ఎరువుగా ఉపయోగిస్తున్నారు.

పంట వ్యర్థాలను రొటేవేటర్‌తో దమ్ము చేస్తున్న రైతు

రైతులకు అవగాహన అవసరం

భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన ఉండాలి. పంట వ్యర్థాలు దుక్కిలో కుళ్లి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. రైతులు అనుసరిస్తున్న విధానాలతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

- శివశంకర్ రెడ్డి, వ్యవసాయాధికారి.

విలేకరులతో మాట్లాడుతున్న లింగారెడ్డి

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, పట్టపగలే హత్యలు, అఘాయిత్యాలు పెరిగాయని జిల్లా టిడిపి అధ్యక్షుడు లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలో ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపలో శుక్రవారం పట్టపగలే నడిరోడ్డుపై వైసిపి కార్యకర్త హత్య జరిగిందన్నారు. ఇదే జిల్లాలో ఓ దళిత అధికారిని హత్య చేశారని తెలిపారు. వైసిపి నాయకులే రెండు గుంపులుగా విడిపోయి భూకబ్జాలు, ఇసుక దందాలు చేసుకుంటూ వారికి వారే దాడి చేసుకుంటున్నారన్నారు. సిఎం సొంత జిల్లాలోనే శాంతిభద్రతలు ఇలా ఉంటే రాష్ట్రంలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల విశాఖకు వచ్చినప్పుడు ఎపిలో అవినీతి, అక్రమాలపై వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా రాష్ట్ర పరిస్థితులపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాయర్ సుబ్బయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

బ్రౌన్ లైబ్రరీ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప నగరంలో ఉన్న బ్రౌన్ లైబ్రరీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో అమూల్యమైన గ్రంథాలు, మెకంజీ కైఫియత్తులు, తాళపత్ర గ్రంథాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, రీసెర్చ్ స్కాలర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. లైబ్రరీ భవనం శిథిలావస్థకు చేరిందని, అందులో స్థలం కూడా చాలడం లేదన్నారు. గతేడాది జూలై 7న భూసేకరణ కోసం రూ.2.50 కోట్లు, భవన నిర్మాణం కోసం రూ.3కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 94ను జారీ చేసిందని తెలిపారు. రెండేళ్లు కావస్తున్నా పైసా కూడా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గండికోట వద్ద పెన్నానదిపై నిర్మించిన గండికోట ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన కుటుంబాలకు మూడేళ్లయినా పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. పునరావాస కాలనీలు కూడా పూర్తి కాక పోవడం శోచనీయమన్నారు. ఇంకా ప్రభుత్వం నిర్వాసితులకు రూ.454 కోట్లు అందజేయాల్సి ఉందన్నారు.

మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి చంద్రబాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాజుపాలెం మండలం తొండలదిన్నెలో ఆదివారం ఆయన భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుదేశం పార్టీ ముందస్తు మ్యానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, బాలసుబ్బన్న, మాబు షరీఫ్, చెమికెల శ్రీనివాసులురెడ్డి, చమికెల వెంకటసుబ్బారెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, పెన్నా నగర్ మజీద్ మెరువ మూర్తి, గోపవరం గౌస్, భగసింగ్ కాలనీ చిచ్చు ఎర్రన్న, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్ ఆధునికీకరణకు కృషి

- బిసి సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బ్రహ్మయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాకు అద్భుతమైన వరంగా ఉన్న పాత కలెక్టరేట్ భవనాన్ని ఆధునీకరించేందుకు కృషి చేయాలని బిసి సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్ కార్యాలయంలో జిల్లాలోని వారసత్వ సంపదను గుర్తించడం గురించి సభ్యులతో చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాత కలెక్టరేట్‌ను సంరక్షించుకుని ఆధునీకరిస్తే ఆదాయంతో పాటు అద్భుతమైన వారసత్వం దక్కించుకున్న వారమవుతామని తెలిపారు. ఇంటాక్ ఆధ్వర్యంలో ఇప్పుడున్న గ్రంథాలయంతో పాటు గ్రామీణ వ్యవసాయ పనిముట్లతో ప్రత్యేకంగా మ్యూజియం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సంస్థ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొన్నటివరకు జానపద పాటలను డాక్యుమెంటేషన్ చేశారని, ప్రస్తుతం మొన్నటి తరం ప్రముఖుల చేతిరాతను సేకరించి రక్షించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పర్యాటక శాఖ పూర్వ అధికారి రాజశేఖర్ రెడ్డి జిల్లాలోని వారసత్వ సంపద గల ప్రాంతాల గురించి తెలిపారు. కో-కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి, కొండూరు జనార్ధన రాజు జానపద యువ గాయని సరళను ఘనంగా సత్కరించారు. పద్మ ప్రియ చంద్రారెడ్డి తన శిష్య బందంతో రూపొందించిన జిల్లా పర్యాటక ప్రాంతాలకు సంబంధించి పోస్టర్లను సభ్యులు ఆవిష్కరించారు. ఆకాశవాణి కడప కేంద్రం కళాకారుడు గౌరీ శంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, వి. గౌరి శంకర్, మాజీ అధ్యక్షులు జోజిరెడ్డి, మాకం నాగరాజ, భారవి, సంజీవరెడ్డి, బాల యల్లారెడ్డి, రేడియో గంగాధర్, బోగాల కొండారెడ్డి, ముఖేష్, ఎల్లేశ్వరావు, దేవతి రవి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఆకతి కిషోర్, ప్రొఫెసర్ సుబ్బారెడ్డి ఇంటాక్ సభ్యత్వం స్వీకరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

మైదానం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - కడప

అంజుమన్ జన్నతుల్ బాకీబెరియల్(కబరస్తాన్) మైదానం అభివృద్ధి కోసం మసీదు కమిటీ చెన్నూరు వారికి వైసిపి సీనియర్ నాయకులు షేక్ సుభాన్‌బాషా, రూ. 50 వేలు విరాళం అందజేశారు. షేక్ సుభాన్‌బాష తల్లి రెండవ వర్ధంతి సందర్భంగా ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థ ప్రిన్సిపల్ సుల్తాన్ బాబా, 33 వ డివిజన్ కార్పొరేటర్ చాక్లెట్ గౌస్ బాషా, అంజుమన్ జన్నతుల్ బాకీ కమిటీ సభ్యులు షబ్బీర్, అన్వార్, జుమ్మాన్, మరియు ఉస్మాన్ ఖాన్, సోషల్ వర్కర్ మన్సూర్ పాల్గొన్నారు.

వేలంపాట ప్రకటన

కడప జిల్లా పులివెందుల టౌనులో వెలసిన శ్రీమిట్టమల్లేశ్వర స్వామి దేవస్థానం రూమును 3 సంవత్సరాల కాల పరిమితికి మరియు నిరుపయోగంగా విరిగి ఉన్న ప్లాస్టిక్ కుర్చీలు బహిరంగ వేలము పాట 28.6.2023వ తేదీన ఉదయం 10.00 గంటలకు సదరు దేవస్థాన కళ్యాణ మండపము నందు జరుపబడును. వేలంపాటలో పాల్గొనువారు రూ. 1000 ధరావత్తు చెల్లించవలెను. తక్కిన వేలంపాట షరతులు వేలం పాటలో తెలుపబడును.

ఇట్లు

చింతకుంట సుధీకర్‌రెడ్డి,
చైర్మన్.

కె.వి. రమణ,
కార్యనిర్వాహణ అధికారి,

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 జూన్ 2023
5
అన్నమయ్య

నేడు 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలోని అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

కమర్షియల్ షాక్

- యూనిట్‌కు 83 పైసలు పెంపు
- జిల్లాపై రూ.6.77 కోట్ల భారం

"ఈయన పేరు సత్యం, కడప నగరంలోని ప్రకాష్‌నగర్ వీధికి సమీపంలో చిన్నకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల కిందట కొట్టుకు కరెంటు బిల్లు రూ.400 వచ్చేది. ప్రభుత్వం ట్రూఅప్ పేరిట వడ్డించిన వడ్డింపుల నేపథ్యంలో మేలో రూ.900 బిల్లు వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో బిల్లు రావడం ఏమిటో తెలియడం లేదని వాపోవడం కనిపించింది." ఇలా అయితే బతికేదెట్లా అని ఆందోళనను వ్యక్తం చేయడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని వ్యాపారులకు ట్రూఅప్ షాక్ తగిలింది. ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ట్రూ అప్ పేరిట మూడు రకాలుగా కరెంటు ఛార్జీలను భారీగా పెంచేసింది. ఈ మేరకు యూనిట్‌కు సగటున మూడు దశలుగా 83 పైసల చొప్పున పెంచి, 36 మాసాలపాటు వసూలు చేయనుంది. ఈలెక్కన జిల్లాపై రూ.6.77 కోట్ల మేర భారం పడింది. ప్రభుత్వం పేద, ధనిక తారతమ్యాన్ని పాటించకుండా మూడు కేటగిరీల చొప్పున ట్రూఅప్ ఛార్జీలను బాదేస్తోంది.

ఉమ్మడి కడప జిల్లాలో హెచ్‌విడిఎస్ 267 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఐదు కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని సబ్‌స్టేషన్ల పరిధిలో 1,04208 లక్షల కమర్షియల్ సర్వీసులు ఉన్నాయి. చిన్నపాటి దుకాణాల దగ్గర నుంచి భారీ వాణిజ్య సముదాయాల వరకు ఉన్నాయి. ఈ ఏడాది మేలో 1,78,23,142 యూనిట్ల మేర విద్యుత్ వినియోగం జరిగింది. ప్రభుత్వం రూ.83 పైసల చొప్పున ఇటీవల పెంచిన ట్రూ అప్ ఛార్జీల నేపథ్యంలో జిల్లాలోని వ్యాపార కేంద్రాలపై రూ.6.77 కోట్ల మేర అదనపు భారం పడింది. ఫలితంగా జిల్లాలోని వ్యాపార వర్గాలు రెట్టింపు బిల్లులు చెల్లించడంపై పట్ల ఆందోళనను వ్యక్తం చేస్తుండడం గమనార్హం. 2014 నుంచి 2019 వరకు వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూ అప్‌ఛార్జీలను పెంచేసింది. 2022 ఆగష్టు నుంచి 2025 జులై వరకు యూనిట్‌కు రూ.83 పైసలు చొప్పున పెంచేసింది. 2025 జులై వరకు ప్రతి నెలా ట్రూఅప్ పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయనుంది. 2023 మార్చిలో 10.96, మేలో 13.57 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. మే నెలకు ట్రాన్స్‌కో రూ.90.12 కోట్ల ఆదాయం లభించాల్సి ఉంది. 2023 ఏప్రిల్‌లో 11 లక్షల, మే 13.57 లక్షల యూనిట్లు వినియోగం కావడం గమనార్హం. ఈ లెక్కన నెలకు రూ.90.12 కోట్ల మేర ఆదాయం సమకూరనుంది. కమర్షియల్ సర్వీసులకు పెద్దమొత్తంలో బిల్లులు వచ్చాయి.

జిల్లా వ్యాప్తంగా బిపిఎల్ కేటగిరీ కింద ఎనిమిది లక్షల కుటుంబాల వరకు ఉన్న సంగతి తెలిసిందే. పేదల ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి సామాన్యులను ఛార్జీల పెంపుదల నుంచి మినహాయించకపోవడం ఆందోళన కలిగిస్తోంది ప్రస్తుత ట్రూఅప్ ఛార్జీల పెంపు విషయంలో జిల్లాలోని 1,04208 వేల కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు మీద ట్రూ అప్ ఛార్జీలను రెట్టింపు చేయడం పట్ల వచ్చే ఆదాయం కరెంటు ఛార్జీలకు సరిపోతోందనే వాదన వినిపిస్తోంది. రెండు నెలల కిందట కడప నగరంలోని ఓ చిరు వ్యాపారికి రూ.400 వచ్చే కరెంటు బిల్లు ప్రస్తుతం రూ.900 రావడం ఆందోళన కలిగించిందని పేర్కొనడం గమనార్హం. పెట్టుబడికి వడ్డీల చెల్లింపులు పోగా జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వాపోవడం గమనార్హం.

అధిక దిగుబడి కల్పించడమే లక్ష్యం

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్

ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా లో రైతులందరికీ అందుబాటులో ఉండి ఖరీఫ్ సాగులో అధిక దిగుబడి కల్పించడమే తమ లక్ష్యమని జిల్లా వ్యవసాయ అధికారి బి . చంద్రనాయక్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రైతులకు వ్యవసాయం ద్వారా పంటలు ఎలా పండించాలో, అధిక దిగుబడికి ఏయే పంటలు వేయాలో, పంట రుణాలు, ఖరీఫ్‌లో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో వ్యవసాయ శాఖలో ఏడీలు , ఏవోల వివరాలు తెలపండి ?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఏడు డివిజన్లున్నాయి. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూరు, మదనపల్లె, వాల్మీకిపురం, పీలేరు డివిజన్లలో ఏడీలున్నారు. జిల్లాలో 30 మండలాల్లో ఒకరు చొప్పున ఏవోలు ఉన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామ రైతు భరోసా కేంద్రంలో 400 మంది ఉన్నారు.

జిల్లాలో సాధారణ సాగు, ప్రస్తుత సాగు విస్తీర్ణం ఎంత ?

జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం 82,589 హెక్టార్లు రైతులు సాగు చేయాల్సింది. ఇప్పటివరకు 2,200 ఎక్టర్లలో సాగు చేస్తున్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?

ప్రస్తుత ఖరీఫ్‌కు అన్నిరకాల విత్తనాలను అందుబాటులో ఉంచాం. రైతుల అవసరాలకు తగ్గట్టుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతు శిక్షణ కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి వారు ఖరీఫ్ సాగుకు రైతులకి మండల స్థాయిలో, ఆర్‌బికె స్థాయిలో రైతులకు శిక్షణ ఇచ్చి ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేస్తున్నాం.

రైతులకు ఎరువులు, విత్తనాలు ఏమేరకు పంపిణీచేస్తున్నారు ?

జిల్లాలో ఇప్పటివరకు 37 వేల క్వింటాళ్ల కె 6, 14,500 నారాయణి విత్తనాలు, 11,00 క్వింటాళ్ల జనము, 11,00 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు పంపిణీ చేశాం. ఇప్పటివరకు 2,600 టన్నుల అన్ని రకాల ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో రైతుల కోసం అందుబాటులో ఉంచాం.

ఖరీఫ్ పంటల కార్యాచరణ ప్రణాళిక ఏమిటి?

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 82,589 ఎక్టర్లలో సాగు చేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. అందులో 47,885 హెక్టర్లు , వరి జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు తదితర తృణ ధాన్యాలు సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నాం. ఖరీఫ్ పంటల కార్యాచరణలో భాగంగా జిల్లాలో 45 పొలంబడులు ఏర్పాటు చేశారు. రెండు జిపిఎ పొలం బడులు నిర్వహించాం. గ్రామ విత్తన పథకం కార్యక్రమాన్ని సుండుపల్లి మండలంలో సజ్జ పంటపైన అమలు చేయడం జరుగుతుంది. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా 2 వేల హెక్టార్లు ఈ సంవత్సరం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది.

రైతులకు ఎరువుల వాడకం పై ఎలాంటి అవగాహన కల్పించారు?

ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమాలను ఆర్‌బికె, మండల స్థాయిల్లో రైతు శిక్షణా కేంద్రం , కృషి విజ్ఞాన కేంద్రం వారు శిక్షణ ఇస్తున్నారు. అలాగే గుంటూరులోని ఆర్‌బికె ఛానల్ వారు ప్రతి గ్రామంలో ఉండే డిజిటల్ టీవీల ద్వారా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామ, మండలస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎరువుల వాడకంపై తగిన సూచనలు చేస్తున్నారు.

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం తగదు

కరపత్రాలు విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన వైసిపి నాలుగేళ్లల్లో 8 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపి షాక్ ఇస్తున్నారని, ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వ దుశ్చర్యలను తిప్పికొట్టాలని సిపిఐ, సిపిఎం నాయకులు పిలునునిచ్చారు. ఆదివారం ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్‌ఛార్జీల భారంపై ప్రచురించిన కరపత్రాలను వారు విడుదలచేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. మహేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి. రవికుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని చెప్పి అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, నాలుగేళ్లల్లో ప్రజలనే అనేక భారాలు మోపిందని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీలు పెంచడంతో వినియోగదారులు ఉక్కిరిబిక్కి అవుతున్నారని వాపోయారు. విద్యుత్ సంస్థలను కార్పొరేట్ రంగాల వారికి అప్పజెప్పేందుకే ఇలాంటి చర్యలు ప్పాడుతున్నారని చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొని వస్తే ప్రతి పక్షంలో ఉన్న వై.ఎస్? రాజశేఖర రెడ్డి తన ఎమ్మెల్యేలను అందరిని కలుపుకొని ఉమ్మడి రాష్ట్రంలో నిరాహార దీక్ష చేసి వామపక్ష పార్టీలు బషీర్‌బాగ్ ఉద్యమాన్ని నడిపినటువంటి చరిత్ర జగన్మోహన్ రెడ్డి గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమా, కార్పొరేటర్ల ప్రభుత్వమా అని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నప్పుడు రూ. 30 వేలు పెట్టి స్మార్ట్ మీటర్లు బిగించాల్సిన అవసరం ఏముందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలతో సంక్షేమ పథకాలు కూడా తీసివేయడానికి కుట్ర చేస్తున్నారని, ఇప్పటికీ అనేకమంది పథకాలకు దూరమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీలు చేస్తున్న పోరాటాలకు అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు కలిసి వచ్చి పెంచిన విద్యుత్ ఛార్జీలు, పలు రకాల ఛార్జీలను ఉపసంహరించుకునేంతవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవరా, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కాటంశెట్టి వెంకటయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

బదిలీ ఉపాధ్యాయుల వేతనాల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. హరిప్రసాద్, షేక్. జాబీర్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 138 కంటే తక్కువ మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు పోస్టు లేకపోవడం వల్ల అక్కడ పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు ఎవరు చేయాలో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. 138 కన్నా ఎక్కువ విద్యార్థులు ఉన్న యూపీ పాఠశాలలు హై స్కూల్స్ గా అప్ గ్రేడ్ చేసి ఆ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడు పోస్టు వచ్చినప్పటికీ వారికి డిడిఒ కోడ్ లేనందున వారికీ వేతనాల సమస్య ఏర్పడిందని చెప్పారు. ప్లస్ టు పాఠశాలల్లో పిజిటి ఉపాధ్యాయుల జీతాలు పాత పాఠశాలలో చెల్లిస్తారో, కొత్త పాఠశాలలో చెల్లిస్తారో తెలియని అయోమయంలో ఉన్నారని వాపోయారు. పిజిటి ఉపాధ్యాయులు జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలలకు సంబంధించిన అర్బన్ ఎంఇఒ పోస్టులు మున్సిపల్ ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలని, ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పదవ తరగతి మూల్యాంకన విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంబంధించిన టిఎ, డిఎ, రెమ్యూనరేషన్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పథకం అమలు చేసే వరకు స్వతంత్రంగాను, ఇతర సంఘాలను కలుపుకొని ఐక్యంగాను పోరాడతామని తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్‌లను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి బి.చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శులు రమణ మూర్తి,యు.రమణయ్య, పురం వెంకట రమణ, వై.శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డి.చెంగల్ రాజు, నాయకులు కిఫాయతుల్లా, రెడ్డి బసయ్య, హాసన్ పాల్గొన్నారు.

వడ్డెర నాయకుడిని సన్మానిస్తున్న కులస్థులు

రాజకీయ చైతన్యం అవసరం

ప్రజాశక్తి- రాయచోటి

వడ్డెరలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరమెంతైనా ఉందని నాయకులు చల్లా జయకర్ పేర్కొన్నారు. జిల్లాలోని 6 శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఒక్కో నియోజకవర్గంలో మూడు రోజులపాటు వడ్డెర ప్రముఖులతో కలిసి రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైష్ణవి స్టడీ సెంటర్‌లో నిర్వహించిన వడ్డెర కులస్తుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాధికారం సాధించదనే విషయం కులస్థులు తెలుసు కోవాలన్నారు. రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి నియోజ కవర్గాల్లో వడ్డెర్ల ఓట్లు గెలుపును శాసించ గలుగుతున్నాయని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కాలేకపోతున్నందుకు కారణం రాజకీయ చైతన్యం లేకపోవ డమేనన్నారు.ఈ పర్యాయం రాజకీయ వెనుక బాటుతనాన్ని అధిగమించి మన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుని మన సత్తా చాటుదామని అన్నారు. అనంతరం ఆయన్ను ఉద్యోగసంఘ నాయకులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో వడ్డెర మేధావుల ఫోరం కన్వీనర్ కె.జీవా నందం , బీసీ ఉద్యోగసంఘ నాయ కులు టి.రా మాంజులు, రేపన రామాంజులు రేపన శివప్రసాద్, ప్రముఖ రియల్టర్ రేపన రాం ప్రసాద్, వడ్డెర చైతన్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేరంగుల.వెంకటేష్ బత్తల వెంకట్ర మణ,సి.రెడ్డెయ్య దేరంగుల.వెంక టేష్ మల్లెల.రెడ్డప్ప పసుపులేటి ప్రభాకర్ డి.వెంకటేష్ పాల్గొన్నారు. అనంతరం సభ్యులందరి ఏకాభిప్రాయంతో అన్నమయ్య వడ్డెర సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర తాత్కాలిక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘానికి కన్వీనం గా చల్లా జయకర్, కో- కన్వీనర్ గా కే.జీవానందం, ప్రచార కార్యదర్శిగా దేరంగుల వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.

32 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, యర్రావారిపాలెం, కేవీ పల్లి, కలికిరి, కలకడ, గుర్రంకొండ,పెద్దమండెం, కదిరి, పులివెందుల, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షల నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 32 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారికి సహాయంగా వచ్చిన వారికి సత్య సాయి సేవా సమితి సభ్యులు యాదాల పద్మావతి, కేపీఎల్ సంతోషి కుమారి, ఉషాకుమారి బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి చైర్మన్ ఆధ్వర్యంలో రాచవీడు లయన్స్ క్లబ్ సభ్యులు సత్యసాయి సేవా సమితి సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్ భాష,కంటి వైద్యులు సురేష్ బాబు,మహాలక్ష్మి,భా ర్గవి,ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంఇఒలు

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యేలా కృషి చేయాలని నూతన ఎంఇఒ-2 లకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఆదివారం అన్ని మండలాలలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒలు ఆంజనేయులు నాయుడు (చిన్నమ ండెం),వెంకట శివారెడ్డి (రాయచోటి),వెంకట సుబ్బయ్య (లక్కిరెడ్డిపల్లె), డి శ్రీనివాసులు (సంబేపల్లె), వి శ్రీనివాసులు (గాలివీడు), జయ చంద్ర (రామాపురం) ఎమ్మెల్యేను గౌరవ ప్రదంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండలానికి ఇద్దరు ఎంఇఒలు ఉండాలని, అదనపు పోస్టును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందన్నారు అడ్మినిస్ట్రేషన్, మానిటరింగ్ చేయడం ఇద్దరు ఎంఇఒలకు సులువుగా ఉంటుందని, పనిభారం తగ్గడంతో ప్రశాంతంగా పాఠశాలలను పర్యవేక్షించి విద్యా ప్రమాణాలు మెరుగుపర్చవచ్చని చెప్పారు. పాఠశాలలను తరచూ సందర్శిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని , నాడు నేడు పనులలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. తరచూ పాఠశాలలను సందర్శిస్తూ మౌలిక వసతులపై ఆరా తీయాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని చెప్పారు.

మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రానున్న లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్నమయ్య జిల్లా లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మైనార్టీ విభాగం సాయశక్తుల కృషి చేస్తుందని అన్నమయ్య జిల్లా మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తిరిగి రెండు మూడు నెలల్లో ఖాళీగా ఉన్న అన్ని మైనార్టీ విభాగంలో కమిటీలను భర్తీ చేస్తామని అన్నారు. అన్నమయ్య జిల్లాలో మైనార్టీ సంక్షేమం గురించి సమస్యల గురించి పోరాడే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు రాష్ట్ర మైనార్టీ చైర్మన్ షాలిదాదా గాంధీ సూచనల మేరకు త్వరలో జిల్లా వ్యాప్తంగా తిరిగి మైనార్టీలను ఏకం చేస్తూ కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతం దేశంలో మరియు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ఎండగడుతూ ప్రజల్లో క్షేత్రస్థాయిలో తీసుకొని వెళ్తామని ఆయన అన్నారు. జిల్లాలో మైనార్టీలను ఆకర్షించే విధంగా కార్యక్రమాలను శ్రీకారం చుట్టి జిల్లా వ్యాప్తంగా మైనారిటీల మద్దతు కూడగడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే 2024 లోక్ సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసే విధంగా ఆ లక్ష్యంతో పని చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెక్రెటరీ యహియాబాష, మైనార్టీ నాయకులు మన్సూర్, విక్టోరియాస్ జాకీర్ పాల్గొన్నారు.

సిఐకి వినతిపత్రం అందజేస్తున్న తెలుగు యువత నాయకులు

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి నియోజకవర్గ పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలించి యువత జీవితాలు కాపాడాలని మదనపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ టూటౌన్ పట్టణ సిఐ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ మురళీకష్ణకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియాతో యువత భవిషత్తు నిర్వీర్యం అవుతోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో చాలా వరకూ మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని వాపోయారు. ఈ అరాచక వైసిపి ప్రభుత్వం ఇలాగే కొనసాగితే యువతకు భవిష్యత్తు మనుగడకే ముప్పు అని తెలిపారు. గంజాయి,డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న వారిపై నార్కోటిక్ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గ తెలుగుయువత రాజంపేట ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, దివ్య కుమార్ రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ బవజన్, శివ కృష్ణ, నారారెడ్డి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రాయచోటి

కార్పెంటర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ పాలకమండలి సభ్యులు, నియోజకవర్గ టిడిపి నాయకులు సుగువాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు .ఆదివారం పట్టణంలోని సుండుపల్లి రోడ్ కుమ్మరమిట్ట అమీర్ ఫంక్షన్ హాల్లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న అన్నమయ్య కార్పెంటర్ అసోసియేషన్ నూతనకార్యవర్గం సమావేశానికి ప్రసాద్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు జిలాన్ బాషా, ఉపాధ్యక్షుడు మోహన చారి,కార్యదర్శి రమణ, కోశాధికారులు మహమ్మద్ హుస్సేన్ అహ్మద్, జాయింట్ సెక్రెటరీ వీరనాగయ్య, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ అన్నమయ్య కార్పెంటర్ అసోసియేషన్ వారికి ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తనకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇంటి పట్టాలు, ఇళ్లు, అసోసియేషన్ కార్యాలయానికి స్థలం రాబోయే రోజుల్లో సమకూరుస్తానని తెలియజేశారు .ఒక కార్పెంటర్ పని చేస్తుండగా కటింగ్ మిషన్ వల్ల చెయ్యి వేలు తెగి ఆపరేషన్‌కు అధిక ఖర్చు అవుతుందని కార్పెంటర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వైద్య ఖర్చుల నిమిత్తం 20 వేల రూపాయలు ఇస్తానని చెప్పారు. అనంతరం కార్పెంటర్లు అందరికీ ఐడి కార్డులు పంపిణీ చేశారు. కార్పెంటర్ అసోసియేషన్ వారు ప్రసాద్ బాబ కు సన్మానం చేశారు. కార్యక్రమంలో బాబ్జీ, ఇబ్రహీం, ఖాదర్ వలీ, రసూల్, ముబారక్, బ్రహ్మయ్య, టిడిపి నాయకులు మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటి రూపురేఖలు మారుస్తాం : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే రాయచోటి రూపు రేఖలు మారుస్తానని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి కోరారు. ఆదివారం రాయచోటి పట్టణం బోస్ నగర్ వీధుల్లో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ, రాష్ట్రానికి ఇదేమి ఖర్మ, రచ్చబండ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు.రాయచోటి పట్టణంలో ఇంటర్నల్ రోడ్లన్నీ పగిలిపోయి భారీగా గుంతలు ఏర్పడడం రాకపోకలకు తీవ్ర అవరోధం కల్గుతుందని అన్నారు. వైసిపి ప్రభుత్వం కనీసం రోడ్లకు ఉన్న గుంతలు పూడ్చడం కూడా చేయలేదని, డ్రైనేజీలు పూడి పోయి మురుగు నీరు సక్రమంగా పారక కంపుకొడుతోందని వాపోయారు. మున్సిపాలిటీ ఆదాయం ఉన్న ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతున్నట్లు ఆరోపించారు .ఏ వీధికి వెళ్ళినా ఇవే సమస్యలు అధికంగా ఉన్నాయని చెప్పారు. వెలిగల్లు నీళ్ల కూడా సక్రమంగా ప్రజలకు అందడం లేదని తమ దృష్టికి ప్రజలు తీసుకొచ్చినట్లు చెప్పారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన తొలి విడత ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా మహిళలను దృష్టిలో పెట్టుకొని వారికి పెద్దపీట వేశారని మహిళలకు తెలియజేశారు. పట్టణం బోస్ నగర్ పరిసర వీధులలో ప్రజలతో మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి మమేకమై వారి సమస్యలు, ఆర్థిక స్థితిగతులు ప్రస్తుత ప్రభుత్వం పనితీరు కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బోనమల జాఫర్ వలి, ఆతావుల్లా తెలుగు యువత పట్టణ అధ్యక్షులు ఇనాముల్లా, మాజీ కౌన్సిలర్ మహబూబ్ బాషా,పట్టణ ఉపాధ్యక్షులు రెహ్మాన్ ,జగదీష్ ,కొట్టే చలపతి,ఇలియాస్, మాసాపేట జావిద్ పాల్గొన్నారు.

రమేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు, గ్రామస్తులు

ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులైన యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ గురువులైన ఎం.వి.కృష్ణయ్య, జానుమద్ది హను మంతరావు, సాంబ య్యలకు ఎల్లటూరు శ్రీనివాసరాజు, లక్ష్మీనరసయ్య, సుగుణ, వై.రాజేంద్రప్రసాద్ లు పాదపూజ చేసి, పట్టుశాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.5వేల చొప్పున నగదును అందించారు. యల్లటూరు శ్రీనివాసరాజు సొంత నిధులతో రూ.5లక్షల వ్యయంతో పాఠశాలలో స్టేజీని ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గెలివి మల్లి కార్జు నశెట్టి, పరుచూరి శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ నరసయ్య, నాగలక్ష్మి, అమ రావతి, చంద్రశేఖర్, రమణ, నారాయణ, జగదీష్, ఇంతియాజ్, పాండు రంగ, శివారెడ్డి, మాజీ జడ్‌పటిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, తోట శివశంకర్ పాల్గొన్నారు.

సౌమ్యనాథుని సన్నిధిలో ఎస్ఇబి ఎఎస్‌పి

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని ఎస్ఇబి ఎఎస్‌పి ప్రవీణ్ కుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సునీల్‌స్వామి, బాలస్వామి, ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఇబి, టిటిడి సభ్యులు పాల్గొన్నారు.

కుటాలమ్మ తిరుణాలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చెన్నయ్యగారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కుటా లమ్మ తిరుణాల ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక నగలు, పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. తిరుణాలకు ముఖ్య అతిథిగా రాజంపేట యువ నాయకుడు మేడా విజయశేఖర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, రైతుల పచ్చని పంట లతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

పాము కాటేసిందన్న భయం వద్దు

ప్రజాశక్తి-పీలేరు

మట్లాడుతున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పాము కాటేసిం దన్న భయం వద్దని, పాటుకాటు వాస్తవమని తెలిసిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందడం సురక్షితమని డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాము కాటు చేటు' అనే అంశంపై మండల ప్రజలకు సాదారణ మెలకువలు తెలిపారు. పాము కాటు వేసిన శరీర భాగానికి ఐదు సెంటీ మీటర్లకు పై భాగాన విషం పైకి ప్రాకకుండా బట్ట లేదా తాడుతో కొద్దిపాటి బిగుతుగా కట్టి, బాధితుని కదపకుండా ధైర్యం చెబుతూ దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకపోవాలన్నారు. పాము విషం విరుగుడుకి యాంటీ స్నేక్ సీరమ్ ఇంజక్షన్ ఇప్పించాల్సి ఉంటుందని అన్నారు. ఈ ఇంజెక్షన్ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ నిల్వ ఉన్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు అమాయకులు పాము కాటుకు మంత్రాలు, ఆకు పసుర్లు వంటి అశాస్త్రీయ పద్ధతులను ఆశ్రయించడం విచారించదగ్గ అంశమన్నారు. పాము కాటు వాస్తవమైనప్పుడు, అందులో విషం కూడా నిజమని, మంత్రాలు, ఆకు పసుర్లతో నయం కాదనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలని చెప్పారు. పాము కాటుతో మృతి చెందే వారిలో 85 శాతం మంది గ్రామీణ ప్రాంత యువకులే ఉంటున్నారని అన్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ మాసాల మధ్య వ్యవసాయ పనుల కాలం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పాము కాట్లకు గురయ్యే ప్రమాదం అధికమని తెలిపారు. ప్రజలు మెలకువలు పాటిస్తూ పాము కాటుకు గురికాకుండా తమను తాము రక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ పుష్పలత

'పది'లో పాసైన ఆణిముత్యాలకు సత్కారం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలకు ఎంపిక కావడం హర్షణీయమని ప్రిన్సిపల్ పుష్పలత పేర్కొన్నారు. పది ఫలితాల్లో శంకరయ్య, సుజాతల కుమార్తె లక్ష్మి ప్రవీణ 581 మార్కులు, రాజ కుమారి ధనలక్ష్మిల కుమార్తె మధురిమ 577 మార్కులు, పురుషోత్తం ఉషా రాణిల కుమార్తె దిరీష 572 మార్కులు, వెంకటరమణ ఈశ్వరమ్మల కుమార్తె తులసి 572 మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి విద్యార్థి ఇలా కష్టపడి చదివినప్పుడే పాఠశాలకు, తల్లి దండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులు ఫలితాలను సాధించి తోటి విద్యార్థులతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చూపిన ప్రతిభకుకలెక్టర్, డిఇఒలచే ప్రశంసలు అందుకోవడవం సంతోషంగా ఉందన్నారు.

మానవత్వం చాటుకున్న సిఐ

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

రాజంపేటరూరల్ సిఐ పుల్లయ్య మానవత్వం చాటుకున్నారు. పైకి కఠిన హృదయంతో కనిపించే పోలీసులలో కూడా జాలి, దయ ఉంటాయని ఆయన నిరూపించారు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం బోయినపల్లె వైపు పయనిస్తున్న సిఐకు బోయినపల్లి వద్ద ప్రధాన రహదారిలో తిండి, తిప్పలు లేక అలసి సొమ్మసిల్లిపోయిన ఒక బాటసారి కనిపించడంతో వాహనాన్ని ఆపి సిబ్బందితో కలిసి ఆయనకు సపర్యలు చేసి మంచినీరు తాగించి, బట్టలు మార్చి స్పృహలోకి వచ్చేవరకు సేవలందించారు. ఎక్కడి నుంచి వస్తున్నాడో అడిగి వివ రాలు తెలుసుకున్నారు. ఇది చూసిన ప్రజలు సిఐకు అభినందనలు తెలిపారు.

బాటసారిని పరామర్శిస్తున్న సిఐ పుల్లయ్య

పశు బీమా పాడి రైతులకు వరం :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పశుబీమా పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైఎస్ఆర్ పశు బీమా పథకం పాడి రైతులకు వరం లాంటిదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం వాల్మీకిపురం మండలం బూడిదవేడు గ్రామంలో పశు బీమా పథకాన్ని ఎమ్మెల్యే ప్రారం భించారు. పాడి రైతుల శ్రేయస్సు కోరి సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని, దీనివలన రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుం దన్నారు. అనారోగ్యం రీత్యా గాని, ప్రమాదవశాత్తు గాని పశువులు మృతి చెందితే ప్రీమియంను బట్టి రూ. 30 వేలకు పైగా బీమా సాయం పొంద వచ్చునని ఆయన తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లోని పలువురి రైతులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని, ఇంకా బీమా చేసుకోని రైతులు ఈ నెలాఖరులోపు చేసుకోవాలన్నారు. రైతుల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ఆశ యమని, రైతులు బాగుంటేనే సమాజం ప్రగతిపథంలో నడుస్తోం దన్నారు. ఆర్‌బికె కేంద్రాల ద్వారా రైతులుకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తు న్నట్లు, రైతు భరోసా పథకం రైతుల ఆత్మస్థైర్యాన్ని నింపుతోందన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర ఉర్దూఅకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, సర్పంచ్ రాజ గోపాల్‌రెడ్డి, వాల్మీకిపురం ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, పశువైద్యాధి. కారిణి చరిత, ఏఒ హేమలత, సిబ్బంది ఫర్హత్, సురేంద్ర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి : డిఎస్‌పి

పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మహబూబ్‌బాషా

ప్రజాశక్తి-పీలేరు

ముస్లింల పవిత్ర బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపు కోవాలని రాయచోటి డిఎస్‌పి మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం స్థానిక సిఐ కార్యాలయంలో డిఎస్‌పి పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని అన్నారు. ప్రధానంగా ప్రతి ఒక్కరిలోనూ పరమత సహనం చాలా అవసరం అని చెప్పారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి గోవధ జరగకుండా సహకరించాలని అన్నారు. కుర్బానీ ఇచ్చిన తర్వాత వ్యర్థాలను ఇళ్ల మధ్య పడవేకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషా, హిందూ, ముస్లిం మాత పెద్దలు మాట్లాడుతూ పీలేరు పట్టణం సఖ్యతకు, సోదర భావానికి, లౌకికత్వానికి ప్రతీక అని అన్నారు. ఇక్కడ జరిగే ప్రతి హిందూ, ముస్లిం పండుగల్లో అందరూ సహకరించుకోవడం పలువురికి ఆదర్శనీయమని చెప్పారు. కార్యక్రమంలో పీలేరు పట్టణ సిఐ మోహన్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు షౌకత్‌అలీ, గడిబాషా, హిందూ మత పెద్దలు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఆర్‌టిసి నల్లగుట్ట, పద్మావతి నగర్ ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక వారపు సంతకు వెళ్లే మార్గంలో పట్టణ ఎపిఎస్‌పిటిసిఎల్ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్‌టిసి నల్లగుట్ట, పద్మావతినగర్ ప్రాంతాల్లో లావోల్టేజ్ సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు తమ దృష్టికి తెచ్చారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించుకోవడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవిశం కర్‌రెడ్డి, శ్రీరామ సుధాకర్, నాగరాజమ్మ, ఆబిద్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

ఆటో ఆగితే.. కుటుంబం పస్తే..!

వారు స్టీరింగ్ పడితేనే వారి కుటుం బం కదులుతుంది.. వారు ఆటో స్టార్ట్ చేస్తేనే పిల్లల చదువులు సాగుతాయి.. నిరంతరం రోడ్డుపైన తిరిగితేనే అమ్మా నాన్నలకు వైద్యం అందుతోంది.. ఆటో రయ్‌మని రోడ్డుపై పరి గెడితేనే ప్రయాణికులు గమ్యాన్ని చేరుకోగలరు. అయితే వీరి ఆటో ఒక రోజు ఆగితే వారి కుటుంబం పస్తులుండాల్సిందే. ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడాల్సిందే. కుటుంబాలను వదిలి ఎండనక, వాననక, దుమ్ము, కాలుష్యం లెక్కచేయకుండా రోజంతా కష్టపడేది ఆటో కార్మికులే.

ప్రజాశక్తి - జమ్మలమడుగు

బస్సు సర్వీసు లేని కొన్ని గ్రామాలకు ఆటోలే ప్రధాన ప్రయాణ సాధనం. పట్టణంలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లాలంటే ముందుగా గుర్తొచ్చేది ఆటో. ప్రయాణానికి కీలకంగా మారిన ఆటోలు నడిపే వారి జీవనం మాత్రం అంతంత మాత్రమే. రోజంతా కష్టపడినా ఖర్చులు పోనూ రూ.200 నుంచి రూ.300 ఆదాయం వస్తుంది. ఏ రోజు ఆటో ఆగినా ఆరోజు జీవనం భారమే. వారికి కష్టం ఎక్కువ.. ఆదాయం తక్కువగా మారింది. ఆటోల సంఖ్య గణనీయంగా పెరిగింది. పోటీతత్వం ఎక్కువగా ఉంది. ప్రతి పట్టణంలో 10నుంచి 20వరకు ఆటోస్టాండ్లు ఉంటున్నాయి. ఇక్కడ దాదాపు వెయ్యి మంది కార్మికులుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో నడుపుతారు. వీరు ప్రయాణికులతోపాటు విద్యార్థులు, రోగులు, వృద్ధులకు సేవలందింస్తుంటారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి

ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతకు ఆటో డ్రైవింగ్ ఒక ఉపాధిగా మారింది. ఆటో నడపడమే వృత్తిగా భావిస్తున్నారు. తద్వారా వచ్చే సొమ్ముతో తనపై ఆధారపడిన వారిని పోషిస్తూ, వారి అవసరాలు తీరుస్తున్నారు. జమ్మలమడుగు పట్టణంలో దాదాపు 100మందికి పైగా ఆటో నడుపుతున్నారు.

ఆటోస్టాండ్‌లేక అవస్థలు

ఆటో నడిపే డ్రైవర్లకు పలు శాఖల అధికారుల వేధింపులు వారిని అవస్థలుపెడుతున్నాయి. రవాణా, పోలీస్, ట్రాఫిక్ అధికారులు చలానా లతో వారిని ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధినిచ్చే ఆటోలను నిలుపుకోవడానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీలు, ఆటో డ్రైవింగ్ అర్హతను బట్టి ఇవ్వాలని కోరుతున్నారు. ఆటోడ్రైవర్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, ఆటో వర్కర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి కులమతాలకు అతీతంగా సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరు తున్నారు. ఆటో కార్మికులకు ఉచిత వైద్యం అందిం చాలని కోరుతున్నారు. యూనిఫాంను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలనేది వారి డిమాండ్. బ్యాడ్జి కలి గి 50 ఏళ్లు దాటినా డ్రైవర్లకు నెల పెన్షన్, ప్రమా ద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతున్నారు.

చలానాలతో ఇబ్బందులు : విజయ్, సిఐటియు

పట్టణంలో చాలామంది కార్మికులకు ఆటోనే జీవనం. రోజంతా కష్ట పడినా వారి ఆదాయం చాలా తక్కువ. పోలీస్, రవాణా అధి కారుల చాలానాలతో వారికి ఇబ్బందిగా ఉంది. సుమారు ప్రతి ఆటో కార్మికుడు నెలకు చలానా రూపేనా దాదాపు రూ.1000 కడుతున్నాడు. రోడ్ టాక్స్‌లు కూడా అధికంగానే ఉంటున్నాయి.

ఆదాయం లేదు : ఆదాము, ఆటో కార్మికుడు

ప్రస్తుతం నిత్యవసర కుటుంబ ఖర్చు లు బాగా పెరిగాయి. ఖర్చులు తగ్గట్టు ఆదాయం పెరగడం లేదు. ఆటో కార్మికుల సంఖ్య బాగా పెరుగుతోంది. ఆటోస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. మున్సి పాలిటీ అధి కా రులు ఏర్పాటుచేస్తే మేలు.

జీవనం కష్టంగా ఉంది : ఏసుదాసు, ఆటో కార్మికుడు

ఎన్నో ఏళ్లుగా ఆటో కార్మికుడిగా పనిచేస్తున్నాను. ఆటో నడపని రోజు ఇబ్బందులు తప్పవు. రోజురోజుకూ పెరుగు తున్న డీజిల్, పెట్రోల్ ధరలతో మరింత భారంగా జీవనం సాగుతోంది. ప్రభుత్వం ఆటో వాలాలకు సబ్సిడీ రుణాలిచ్చి ఆదుకోవాలి.

కొండెక్కిన మాంసం ధరలు

- మటన్ కిలో రూ.800, చికెన్ కిలో రూ.280, స్కిన్‌లెస్ రూ.300

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇటీవల కాలంలో మాంసం ధరలు కొండెక్కుతున్నాయి. మాంసం కొనాలంటే వినియోగదారులు హడలిపోతున్నారు. ఆదివారం వచ్చిందంటే మాంసపు ప్రియులు ఆ దుకాణాల వద్ద ఉదయం నుంచే బారులుదీరుతారు. అయితే ప్రస్తుతం మటన్, చికెన్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొనాలంటే సామాన్యులకు దడ పుడుతోంది. ఆ దుకాణాల వైపు చూడాలంటే హడలిపోతున్నారు. ప్రస్తుతం కిలో చికెన్ రూ.280. అదే స్కిన్‌లెస్ చికెన్ అయితే రూ.300పెట్టాల్సిందే. ఇక మటన్ విషయానికొస్తే కిలో రూ.800. ఈ ప్రకారం మాంసం ఇంటికి తీసుకెళ్లాలంటే పేద, మధ్య తరగతివారికి గుండెలు గుభేలుమంటున్నాయి. వీటి ధరలను చూసి సామాన్యులు ఆ వైపు అడుగులు వేయడంలేదు. దీంతో మటన్, చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. గత నెలలో రూ.220గా ఉన్న చికెన్ ధర ఇప్పుడు ఏకంగా రూ.80 పెరిగింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న జనానికి చికెన్ ధరలు మరింత ప్రియమయ్యాయి. మటన్, చికెన్ ధరల పెరుగుదలకు వ్యాపారులు పలు కారణాలు చెబుతున్నారు. వేసవి కాలంలో చికెన్ వేడి చేస్తుందని మటన్ వైపు మొగ్గు చూపుతారని, ఎండలకు కోళ్లు చనిపోయి, వాటి దిగుమతి ఉండదని. ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో, దాణా ధరలు పెరగడం, ఇతర ఖర్చుల కారణంగా చికెన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. జూన్ రెండవ వారంలోకి ప్రవేశించినా వర్షం జాడ లేకపోవడం, ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతూ ఉండడంతో వర్షాకాలం ఊపందుకునే వరకు చికెన్ ధరలు భారీగానే ఉంటాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వెలవెలబోతున్న చికెన్ దుకాణం

ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కడప

తొగటవీర క్షత్రియ విద్యార్థులు విద్య, వైద్య రంగంలో రాణించి ఉన్న స్థాయికి ఎదిగాలని తొగటవీ క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్ అన్నారు. సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథులు నగదు పురస్కారాలు, మెమొంటోలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. 78 మంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ. 2 వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొగటవీర క్షత్రియ సంక్షేమ సం ఘం కడప నగర శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ నాలుగు సంవత్స రాలుగా సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి బాగా చదివి తల్లిదండ్రులకు, కులానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిం దు నాగరాజు మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ విద్యార్థులు ముందుగానే లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఆర్‌ఐ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సిఆర్‌ఐ సునీల్ జయంత్, యువజన నాయకుడు మోతుకూరు సుబ్బరాయుడు ,బొమ్మిశెట్టిశెట్టి చంద్రశేఖర్, పల్లా మురళి, వేల్పుల ఉత్తన్న, దొండ్ల వెంకటరమణ, కుల బంధువులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రొఫెసర్ టి.జి.సీతారాం

ప్రతి విద్యార్థీ ఒక మొక్కను నాటాలి

ప్రజాశక్తి-కురబలకోట

పతి విద్యార్థి ఒక మొక్కను నాటండి...చెట్టే ఆక్సిజన్‌కు మూలమని ఢిల్లీ ఎఐసిటిఇ న్యూ ఢిల్లీ చైర్మన్ ప్రొఫెసర్ టిజి సీతారాం విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఆయన పాలొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరము జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. ఆ ఒక్క రోజు మాత్రమే పర్యావరణం గురుంచి ఆలోచించడం కాదని, ప్రతి ఒక్క విద్యార్థి ఒకొక్క మొక్క నాటాలని ఆయన అన్నారు. భూమికి అత్యంత హాని చేస్తున్నది మనమేనని, ప్రపంచ దేశాలు అన్ని కూడా రకరకాల కాలుష్యాలను సముద్రాల్లోకి పంపిస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య మనకు మరి ఎక్కువని, భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను ఎలా తగ్గించాలో ప్రతి ఒక్క విద్యార్థి ఆలోచించాలని, వీటి పై నూతన పరిశోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబెర్ టిజి.రవికుమార్, ఎన్‌సిసి విద్యార్థులు, లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో స్థాఇక ఓబులేశ్వర్ లెనిన్ మార్ట్ అధినేత బి.ఓబుల్ సుబ్బారెడ్డి ఆర్థిక సహాయంతో ఆదివారం బండ పల్లి పంచాయితీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వ హించినట్లు అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ కార్య క్రమాలు చేయాలని కోరారు. దాత బి.ఓబుల్‌సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే వృద్దులకు అన్నదాన కార్య క్రమం చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో చేయ డానికి నావంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపా ధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్,లయన్ బి.రాజశేఖర్ రెడ్డి, దాత కుటుంబ సభ్యులు బి.యోగిశ్వర్‌రెడ్డి, బి.యోగిరెడ్డి, ప్రేమాలయం మేనేజర్ సుబ్బయ్య, దేవనాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే లక్ష్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాబోయే 2024లో జరుగబోవు దేశ సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే ప్రధాన లక్ష్యమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.రెడ్డి సాహెబ్ ధీమా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యవసరాల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అమాంతం పెంచేసి సామాన్యులపై పెనుభారం వేసిందన్నారు. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో ప్రజలు తమ ఉద్దేశాన్ని బిజెపికి ఓటు రూపంలో చాటిచెప్పారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరా వృతమవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 23న జరిగిన జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ప్రముఖులు మయప్పన్, జంగా గౌతమ్, ఎన్.తులసిరెడ్డి, సాకే శంకర్, దాదా గాంధీ, నజీర్ అహ్మద్, యువత అధ్యక్షులు రామారావు తమ ప్రసంగాలతో దిశా నిర్దేశం చేశారన్నారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయ కులు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ పూర్తి చేసిన భారత్ జోడో యాత్రతో కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు దేశ ప్రజల హృదయాలను గెలిచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహబూబ్ పీర్,అల్లాబక్షు,మహమ్మద్ అలీ,గఫూర్ బాషా,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డి జన సంక్షేమ సంఘం పదవికి రాజీనామా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో రెడ్డి జన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా గత తొమ్మిది సంవత్సరాలు పనిచేసిన రోజా హోటల్ అధినేత కంభం నాగభూషణ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా తనను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకో వడం జరిగిందని, కమిటీ సహాయ సహకారాలతో పట్టణంలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంఘానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు తెచ్చామని తెలిపారు. సంఘ సభ్యుల సహకారంతో ఆర్థిక పరిస్థితులను కింది స్థాయి నుంచి కమిటీ సభ్యులు ఊహించనిదానికంటే ఆర్థిక పరిస్థితులను ఎంతో అభి వృద్ధిలోకి తీసు కొచ్చామని తెలిపారు. అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులకు తెలియ కుండా ఎవరికి వారే నిర్ణయం తీసుకోవడం చాలా బాధ కలిగించిందని చెప్పారు. సంఘం ప్రతిష్టలు దెబ్బతీయకూడదనే సంకల్పంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజల కనీస అవసరాలు తీర్చి, వారికి సౌకర్యవంతమైన జీవితాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని సున్నపుబట్టీ (ప్రగతినగర్) కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తుండడంతో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, మున్సిపల్ అధికారులతో ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు రూ.35లక్షలతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గత పాలకులు ప్రొద్దుటూరును ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంతో ప్రొద్దుటూరులో సమస్యలే ఉన్నాయన్నారు. తాము అధికారంలోకొచ్చాక కూరగాయల మార్కెట్, బస్టాండు, మంచినీటి పథకం ఇలా ఒక్కొక్కటి చేసుకుంటూ వస్తున్నామన్నారు. పట్టణంలోని 40వార్డులు కూడా ఇలాగే అభివృద్ధి చేశామన్నారు. ఈ క్రమంలో ఇక్కడ కూడా రహదారి, కాలువలను పూర్తి చేస్తామన్నారు.